# పదవి ఉన్నా పైసా పని చేయని మంత్రి

- అభివృద్ధి పనులు పూర్తి చేయడంలో శ్రీధర్ బాబు విఫలం
- 16 నెలలుగా తెలంగాణ చౌక్ రోడ్డు పూర్తి కాలే
- నోట్ల సంచులతో ఓట్లు దండుకోవడం అలవాటైంది
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ ధ్వజం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్

రామగిరి, ఏప్రిల్ 15: చేతిలో పదవి ఉన్నా మంత్రి శ్రీధర్ బాబు పైసా పని చేయడం లేదని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ విమర్శించారు. సెంటినరీకాలనీ తెలంగాణ చౌక్‌లో అసంపూర్తిగా ఉన్న కల్వర్టు నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పుట్ట మధూకర్ మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 16 నెలల కాలంలో అభివృద్ధి పనులు పూర్తి చేయడంలో మంత్రి శ్రీధర్ బాబు పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో పెద్దపల్లి –కాటారం వరకు డీఎంఎఫ్‌టీ ద్వారా రూ. 300 కోట్లతో నిధులు మంజూరు చేయించి రోడ్డు పనులు ప్రారంభించామని గుర్తు చేశారు. 70 నుంచి 80 శాతం రోడ్డు పనులు పూర్తికాగా, గ్రామాల్లో సెంట్రల్ లైటింగ్, డివైడర్లు, డ్రైనేజీల పనులు తీసుకు రావడంతో 20 శాతం పనులు మిగిలి పోయాయని తెలిపారు. తెలంగాణ చౌక్‌లో చేపట్టిన కల్వర్టు వద్ద రోడ్డు పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయన్నారు. మంథని ఎమ్మెల్యే ఈ దారి గుండానే రాకపోకలు సాగిస్తున్నా పూర్తి చేయడం లేదన్నారు. కాంట్రాక్టర్, సంబంధిత శాఖ ఈఈలతో మాట్లాడితే బిల్లులు రాక పనులు చేయలేకపోతున్నామని చెబుతున్నారని,కనీసం బిల్లులు ఇప్పించి పనులు పూర్తి చేయించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. 16 నెలల క్రితం శిలాఫలకం వేసిన పనులు పూర్తి చేయకుండా మళ్లీ మంత్రి శిలాఫలకాలు వేస్తున్నాడని ఎద్దేవా చేశారు. కమాన్‌పూర్ మండలంలో తహసీల్దార్ ఆఫీస్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారని విమర్శించారు. ప్రజల ఓట్లు వేస్తేనే మంత్రి పదవి వచ్చిందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. మంత్రి పదవి వచ్చిన తర్వాత 16సార్లు విదేశాలకు వెళ్లిన శ్రీధర్ బాబు రాష్ట్రాన్ని కూడా ఇతర దేశాల్లాగే తీర్చిదిద్దుతామని మాట్లాడుతున్నాడని, ముందు మంథని నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తే చాలన్నారు. బుల్లెట్ ప్రూఫ్, నల్ల అద్దాల కార్లతో తిరగడమంటే ప్రజలను, సమస్యలను చూడకుండా వెళ్లడం కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. పెద్ద పదవి వస్తే ఆ నియోజకవర్గంను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతోపాటు అక్కడి ప్రజలకు మేలు చేసే పనులు చేస్తారని, కానీ ఇక్కడ మాత్రం అందుకు భిన్నంగా జరుగుతున్నదన్నారు. 16 నెలల్లో 16 మందికి ఉద్యోగం కల్పించ్చకపోగా, ఒక్క ఇండస్ట్రీ స్థాపించాలనే ఆలోచన చేయలేదని విమర్శించారు. ఎన్నికలు వస్తేనే నోట్ల సంచులతో వచ్చి ఓట్లు దండుకోవడం ఎమ్మెల్యేకు అలవాటైందన్నారు. ప్రజల్లో చైతన్యం వస్తేనే అభివృద్ధి జరుగుతుందన్నారు. ఎంతో చైతన్యం ఉన్న రామగిరి మండలం నుంచి నియోజక వర్గంలో మార్పు మొదలు కావాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా శ్రీధర్‌బాబు కళ్లు తెరిచి అధికారం, పదవులు ఇస్తున్న మంథని ప్రజల గురించి ఆలోచన చేయాలని సూచించా రు. అభివృద్ధి పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

## జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా సునీత


జడ్జి సునీత

పెద్దపల్లి కమాన్, ఏప్రిల్ 15 : పెద్దపల్లి జిల్లా ప్రధాన న్యాయ స్థానం ప్రధాన న్యాయ మూర్తిగా సునీత కుంచల నియమితులయ్యారు. గతంలో ఇక్కడ జడ్జిగా పని చేసిన డాక్టర్ డీ హేమంత్‌కుమార్ రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయంలో న్యాయ సలహాదారుగా బదిలీపై వెళ్లారు. నిజామాబాద్ జిల్లా జడ్జి పని చేస్తున్న సునీతను పెద్దపల్లికి బదిలీ చేస్తూ మంగళవారం హైకోర్టు నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

## బదిలీపైవెళ్తున్న అధికారికి ఆత్మీయ సన్మానం

యైటింక్లయిన్ కాలనీ, ఏప్రిల్ 15: ఆర్జీ–2 జీఎం కార్యాలయంలో సర్వే అధికారిగా విధులు నిర్వర్తించి మందమర్రి ఏరియాకు బదిలీపై వెళ్తున్న భూక్యా దేశాయిని మంగళవారం జీఎం కార్యాలయంలో అఫిషియేటింగ్ జీఎం ఎం.రాముడు, వివిధ శాఖల అధికారులు సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఓసీపీ–3 పీఓ ఉదయ్ హరిజన్, ఏజీఎం ఎర్రన్న, రక్షణ అధికా రి సంతోష్‌కుమార్, డీజీఎం అనిల్‌కుమార్, మురళీకృష్ణ, సర్వే అధికారి ఉజ్వల్ బదోపాధ్యాయ, సుజన్ మెహ్రా, వెంకట రామచంద్ర, పండరీనాథ్, సురేశ్‌బాబు, విజయ్‌సాగర్, అశ్విని పాల్గొన్నారు.

## సర్టిఫికోట్ ట్రైనింగ్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి కమాన్, ఏప్రిల్ 15 : టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ ట్రైనింగ్ కోర్సు కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈవో డీ మాధవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే ఒకటో తేదీ నుంచి 42 రోజుల పాటు శిక్షణ ఉంటుందని చెప్పారు. ఏప్రిల్ 17వ తేదీకి అభ్యర్థుల వయస్సు 18 నుంచి 45 ఏళ్లు ఉండాలని, సెకండరీ స్కూల్ సర్టిఫికెట్, లోయర్ గ్రేట్ టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని తెలిపారు. అర్హులు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసి, అడ్మిషన్ కార్డు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈ నెల 29లోపు అభ్యర్థులు తమ దరఖాస్తులను ఉమ్మడి జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం (కరీంనగర్)లో అందజేయాలని తెలిపారు.

## ముత్తారం మండలంలో భారీ వాన

ముత్తారం, ఏప్రిల్ 15 : మండలంలో మంగళవారం రాత్రి భారీ వర్షం పడింది. ఈదురు గాలులతో పాటు స్వల్పంగా రాళ్లవాన కురిసింది. ఈ వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాల వద్ద వడ్లు తడిసి ముద్దయ్యాయి. కోత దశలో వరి పొలాలు నేలకొరిగాయి. ఈ అకాల వర్షంతో అన్నదాతలు తీవ్రంగా నష్ట పోయారు.

# రజతోత్సవ సభకు వేలాదిగా తరలి రావాలి

- మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్
- బీఆర్ఎస్ సభ విజయవంతానికి సన్నాహక సమావేశం


మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్

గోదావరిఖని, ఏప్రిల్ 15: ఈ నెల27న ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు రామగుండం నియోజకవర్గం నుంచి ప్రజలు వేలాదిగా తరలి రావాలని మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు. ఈ నెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించనున్న పార్టీ రజతోత్సవ సభ సన్నాహక సమావేశం మంగళవారం స్థానిక 12వ డివిజన్ వినాయక మండపంలో జరిగింది. సమావేశానికి కోరుకంటి చందర్ హాజరయ్యారు. సభకు వెళ్లేందుకు తగిన ఏర్పాట్లపై చర్చించారు. ఇక్కడ బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు బొడ్డు రజిత రవీందర్, రాకం లతాదామోదర్, జంజర్ల మౌనిక, బొబ్బిలి సతీశ్‌కుమార్, నారాయణదాసు మారుతి, నాయకులు బొడ్డు రవీందర్, చీకట్ల లక్ష్మయ్య, లక్ష్మీరాజం, మేకల నవీన్, రాసమల్ల విజేందర్, బుర్రి వెంకటి, బొడ్డు రాజేశం, గాండ్ల సునీల్, ధరిణి రాములు, పోరండ్ల నారాయణ, దుస్స వెంకటేశ్, ఎర్రోళ్ళ రాజు, హరికృష్ణ, రామారాజు, శంకర్, గుంషావలి, శ్రీహరి, శ్రీనివాస్, డిష్ రవి ఉన్నారు.

# నైనీ బొగ్గుబ్లాక్ నేడే ప్రారంభం

- ఒడిశాలో లాంఛనంగా ప్రారంభం
- కేసీఆర్ హయాంలోనే పురుడుపోసుకున్న బొగ్గుబ్లాక్

గోదావరిఖని, ఏప్రిల్ 15 : 13 దశాబ్దాల చరిత్రలో తొలిసారిగా సింగరేణి ఇతర రాష్ట్రంలో సింగరేణి గని ప్రారంభోత్సవం చేయనుంది. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ చొరవతో అప్పటి సింగరేణి సీఎండీ శ్రీధర్ హయాంలోనే ఒడిశాలో సింగరేణి నైనీ బొగ్గు బ్లాక్ ఏర్పాటుకు పురుడుపోసుకుంది. బొగ్గుబ్లాక్ ఏర్పాటుకు అన్ని అనుమతులకు రూపకల్పనతో క్రమంగా నేడు ప్రారంభోత్సవం కానుంది. తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బుధవారం గనిని వర్చువల్‌గా లాంఛనంగా ప్రారంభించనున్నట్లు సింగరేణి సీఎండీ బలరాం తెలిపారు. 2016 మే నెలలో ఈ గనిని కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ సింగరేణికి కేటాయించినప్పటి నుంచి అన్ని రకాల అనుమతులు సాధించి గనిలో తవ్వకం ప్రారంభించడానికి తొమ్మిది సంవత్సరాల సుదీర్ఘ కాలం పట్టింది. సింగరేణిలో ప్రస్తుతం ఉన్న 17 ఓపెన్‌కాస్ట్‌ల గనుల కన్నా అతిపెద్ద గని ఇది. ఈ గనిలో 340.78 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు తవ్వితీయడానికి అవకాశం ఉంది. గనిలో ఉత్పత్తి పూర్తిస్థాయికి చేరుకుంటే ఏడాదికి 10 మిలియన్ టన్నులు అనగా కోటి టన్నుల బొగ్గు ఉత్పత్తి కానుంది. ఏడాదికి కోటి టన్నుల చొప్పున 38 సంవత్సరాల పాటు గని నుంచి బొగ్గు తవ్వకాలు చేపట్టనున్నారు. తెలంగాణలోని ప్రస్తుతం ఉన్న సింగరేణి ఓసీపీ గనులలో టన్ను బొగ్గు తవ్వి తీయడానికి సగటున 12 టన్నుల ఓవర్ బర్డెన్ (పై మట్టి) తొలగిస్తుండగా, ఈ గనిలో మాత్రం టన్ను బొగ్గుకు కేవలం రెండున్నర క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తీస్తే సరిపోతుంది. దీంతో సింగరేణికి లాభదాయకమని భావిస్తున్నారు. ఈ గనిలో మేలైన జీ 10 రకం బొగ్గు లభించనుంది. మరో మూడేళ్లలో ఇది కార్యరూపం దాల్చే అవకాశం ఉంది. ఈ నైనీ బొగ్గు బ్లాక్‌కు 2,255 ఎకరాల భూమి సేకరణ ఉంది. దీనిలో 1,935 ఎకరాల అటవీభూమి, 320 ఎకరాల ప్రభుత్వ, ప్రైవేటు భూమి ఉంది.

## మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు

పెద్దపల్లి, ఏప్రిల్15: జిల్లాలో మత్తు పదార్థాలు, డ్రగ్స్ నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ దాసరి వేణు సంబంధిత అధికారులను ఆదేశించారు. మత్తు పదార్థాలు, డ్రగ్స్ నియంత్రణకు చేపట్టిన చర్యలపై కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశం నిర్వహించారు. జిల్లాలో నమోదవుతున్న ఎన్‌డీపీఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ, మత్తు పదార్థాల వాడకం– నియంత్రణ, నివారణకు శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై విస్తృత ప్రచారం వంటి పలు అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ చెడు అలవాట్ల వల్ల ఆరోగ్యం దెబ్బ తింటుందన్నారు. ఆలోచనా విధానం, ఆలోచనా శక్తి నశిస్తాయని తెలిపారు.భావితరాలు మాదక ద్రవ్యాల పట్ల ఆకర్షితులు కాకుండా వారికి సమాజంలో మంచి, చెడు తెలియ జేయాలని సూచించారు. కేజీబీవీలు, మోడల్ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో డ్రగ్స్, మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై వైద్యాధికారులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో పెద్దపల్లి, గోదావరిఖని ఏసీపీ జీ కృష్ణ, ఎం రమేష్, కలెక్టరేట్ పర్యవేక్షకుడు బీ ప్రకాష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గడువు పొడిగించాలి

కోల్‌సిటీ, ఏప్రిల్ 15: రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు గడువు గడువు పొడిగించాలని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేశ్ కోరారు. ఈమేరకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులకు ట్విట్టర్ ద్వారా లేఖ పంపినట్లు తెలిపారు. ఈనెల 14తో దరఖాస్తుల గడువు ముగియగా, సోషల్ మీడియాలో మరో పది రోజులు పొడిగించినట్లు ప్రచారం జరుగుతుందనీ, ఇది నమ్మి ఔత్సాహికులు మీసేవా సెంటర్ల వద్దకు వెళ్తే వెబ్‌సైట్ పని చేయడం లేదని పంపిస్తున్నారని పేర్కొన్నారు. రాయితీ రుణాలకు సంబంధించి రామగుండం కార్పొరేషన్‌లో ప్రచార లోపం వల్ల అనేక మంది ఆ పథకంను కోల్పోయే పరిస్థితి నెలకొందన్నారు. గడువును మరో పది రోజుల పాటు పొడిగించాలని కోరారు.

## ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య

ఫర్టిలైజర్‌సిటీ, ఏప్రిల్ 15: గోదావరిఖని విఠల్‌నగర్‌కు చెందిన ఎండీ సాజీద(42)జీవితంపై విరక్తి చెంది మంగళవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గోదావరిఖని వన్‌టౌన్ ఎస్ఐ టీ శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సాజిదాకు కూతురు ఉన్నది. ఆమెకు వివాహమైంది. కూతురును అత్తారింటికి వెళ్లడం సాజిదాకు ఇష్టం లేదు. కూతురును తన వద్దనే ఉండాలని, తనను విడిచిపెట్టి వెళ్లితే ఉరివేసుకొని చనిపోతానని అంతకు ముందు చాలాసార్లు బెదిరించింది. ఈ క్రమంలో తన కూతురు సానియా భర్త వద్దకు వెళ్తున్నట్లు బ్యాగు తీసుకొని వెళ్లగా సాజిదా ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి రేకుల పైపునకు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసునమోదు చేసుకోని విచారణ చేపట్టారు.

## ముందస్తు అనుమతి తీసుకోవాలి

మంథని, ఏప్రిల్ 15: ముందస్తు అనుమతులు లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు చేస్తే ఉపేక్షించేది లేదని మంథని ఎస్ఐ రమేశ్ ప్రకటనలో తెలిపారు. మత విద్వేషాలు రెచ్చగొట్టినా, అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ముంద స్తు అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీ నిర్వహించరాదని స్పష్టం చేశారు. డీజేలకు అనుమతి లేదని, డ్రోన్ కెమెరాలను ఎగురవేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా నిరసనలు, దిష్టిబొమ్మ దహనం చేస్తే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

## క్వింటాలు పత్తి గరిష్ట ధర రూ. 7456

పెద్దపల్లి, ఏప్రిల్15: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాలు పత్తికి గరిష్ట ధర రూ. 7456 పలికింది. మంగళవారం 25 మంది రైతులు తీసుకవచ్చిన 204 క్వింటాళ్ల పత్తిని ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేయగా, క్వింటాలుకు గరిష్ట ధర రూ. 7456, కనిష్ట ధర రూ. 6156, సగటు ధర రూ. 7011 లభించిందని ఇన్‌చార్జి ఉన్నత శ్రేణి కార్యదర్శి మనోహర్ తెలిపారు.

## మోటర్లు బిగిస్తే జరిమానా

మంథని, ఏప్రిల్ 15: నీటి కుళాయిలకు మోటర్లు బిగిస్తే జరిమానా విధిస్తామని మున్సిపల్ కమిషనర్ మనోహర్ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. కొంత మంది మిషన్ భగీరథ నల్లాలకు మోటార్లు బిగించడంతో పట్టణంలో చాలా మందికి తాగునీరు సరఫరా కావడం లేదన్నారు. ఇలా ఎవరైనా చేస్తే వారికి జరిమానా విధిస్తామన్నారు. కుళాయిలకు మోటార్లు పెట్టే వారిని గుర్తించి జరిమానా విధిస్తారని, ఎవరూ మోటార్లు పెట్టవద్దని సూచించారు.

## నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

పెద్దపల్లి టౌన్, ఏప్రిల్15: దేశంలో కార్మికు లకు వ్యతిరేకంగా ఉన్నా నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని కార్మిక సంఘా లు డిమాండ్ చేశాయి. మంగళవారరం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, మాస్‌లైన్, ఐఎన్‌టీయూసీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కే, విశ్వనాథ్, ఎరవెల్లి ముత్యంరావు, చిలుక శంకర్, కడారి సునీల్, బూమల్ల చందర్, వైకుంఠం మాట్లాడారు. మే 20న నిర్వహిచ తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు మద్దతు పలుకాలని పిలుపునిచ్చారు. ఇక్కడ నాయకులు పూసాల రమేశ్, సీపెల్లి రవీందర్, సమ్మిరెడ్డి, భీమయ్య, అశోక్, నరేశ్, ఆనంద్ పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత

ధర్మారం,ఏప్రిల్15:ధర్మారం మండలం కొత్తూరు గ్రామానికి చెందిన బానోతు రామ్ చరణ్‌కు మాజీ సర్పంచ్ తాళ్ల మల్లేశం గౌడ్ ఆర్థిక సాయం చేసి అండగా నిలిచారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో రామ్ చరణ్ తీవ్రంగా గాయపడ్డాడు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. యువకుడిది నిరుపేద కుటుంబం కావడంతో అతనికి వైద్య ఖర్చుల కోసం మల్లేశం గౌడ్ తనవంతుగా రూ. 5 వేలు దవాఖానకు వెళ్లి బాధితుడికి అందజేశారు.సాయం చేసిన మల్లేశం గౌడ్‌కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

గోదావరిఖని, ఏప్రిల్ 15: బొగ్గుగనుల వేలం, ప్రభుత్వరంగ సంస్థల అమ్మకం, ప్రైవేటీకరణ, నాలుగు లేబర్‌కోడ్‌లకు వ్యతిరేఖంగా మే 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు తుమ్మల రాజారెడ్డి, మంద నరసింహారావు కోరారు. మంగళవారం ఆర్జీ–1 ఏరియా వర్క్‌షాప్‌లో జరిగిన గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. మార్చి 18న న్యూఢిల్లీలో కేంద్ర కార్మిక సంఘాలు, ఫెడరేషన్లు సమావేశంతో కేంద్రం అమలు చేయాలనుకుంటున్న కొత్త లేబర్‌కోడ్‌లు, ప్రైవేటీకరణ విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ తలపెట్టిన ఒకరోజు దేశవ్యాప్త సమ్మెకు పిలుపు నేపథ్యంలో సింగరేణిలో కార్మిక వర్గం సమ్మెలో పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలన్నారు. ఇక్కడ యూనియన్ నాయకులు ఆరెపల్లి రాజమౌళి, మెండె శ్రీనివాస్, తోట నరహరి రావు, మహేశ్, రాజేశ్వరచారి, రాజేశ్వరరావు, నారాయణ, రవి, సంతోశ్, బొడ్డుపల్లి రవి, సంతోశ్‌కుమార్ ఉన్నారు.

## ఎల్వోసీ అందజేత

ముత్తారం, ఏప్రిల్ 15; ఓడేడ్ గ్రామానికి చెందిన మహ్మద్ చాంద్‌పాషా అనారోగ్యంతో హైదరబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ వైద్య ఖర్చుల కోసం ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును ఆర్థిక సాయం ఇప్పించాలని కోరారు. ఆయన సీఎంఆర్‌ఫ్ ద్వారా రూ. 2 లక్షల రుపాలయ ఎల్‌వోసీ ని మంజూరి చేసి వారి కుటుంబ సభ్యులకు అందించారు. ఎల్‌వోసీ మంజూరి చేయించినందుకు మంత్రి శ్రీధర్ బాబుకు బాధిత కుటుంబ సభ్యులు కృతజతలు తెలియజేశారు.

## చిత్ర కళాకారులను ఆదుకోవాలి

పెద్దపల్లి టౌన్, ఏప్రిల్15: రాష్ట్ర ప్రభుత్వం చిత్ర కళాకారులను గుర్తించి ఆదుకోవాలని జిల్లా ఆర్టిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు చిప్పకుర్తి సత్యనారాయణ విజ్ఞప్తి చేశాడు. మంగళవారం జిల్లా కేంద్రంలోని శాంతినగర్ లవ్ సింబల్ ఆఫ్ పెద్దపల్లి వద్ద చిత్ర కళాకారులు కేక్ కట్‌చేసి సంబురాలు చేసుకున్నారు. ఇక్కడ నాయకులు మల్లేబోయిన మోహన్, ఆరెపల్లి దేవారాజ్, కొత్తూరి మోహన్, మాతంగి కుమార్, తదితరులు ఉన్నారు.

## బ్లాక్ స్పాట్ల పరిశీలన

రామగిరి, ఏప్రిల్ 15: కల్వచర్ల శివారు నుంచి రామయ్యపల్లి వరకు గల ప్రధాన రోడ్డుపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలను మంగళవారం ఎస్ఐ చంద్రకుమార్, ఆర్ అండ్ బీ ఏఈఈ సాయితేజతో కలిసి పరిశీలించారు. ప్రమాదాలు జరగడానికి రోడ్డుపై గల ఇంజినీరింగ్ లోపాలను గుర్తించి ఏ విధమైన భద్రత చర్యలు చేపట్టాలో సూచించారు. వాహన చోదకులు ట్రాఫిక్ నియమాలను పాటించాలనీ, డ్రంక్ అండ్ డ్రైవ్ చేయకూడదని ఎస్ఐ సూచించారు.

## రామగుండం తహసీల్దార్ బదిలీ

జ్యోతినగర్(రామగుండం), ఏప్రిల్ 15: రామగుండం తహసీల్దార్ కుమారస్వామి మంథనికి బదిలీ అయ్యారు. రామగుండంకు డిప్యూటీ తహసీల్దార్ ఈశ్వర్ ప్రస్తుతానికి ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు తీసుకున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

I. Neerati Haarika W/o. Vishnuprasad, H.No. 11-83, Racharla Boppapur, Yellareddypet Mandal. Rajanna Sircilla Dist. My Name was Changed to Gattipally Thirumala D/o.Naga Bhooshanam.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571
9182 777 189

# 'భూ భారతి'పై విస్తృత ప్రచారం చేయాలి

- రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ చేసే సమయంలో సర్వే మ్యాప్ తప్పనిసరి
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, ఏప్రిల్ 15: రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చి భూ భారతి ఆర్వోఆర్ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులకు సూచించారు. భూ భారతి చట్టం అమలుపై మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి కలెక్టర్ సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ చేసే సమయంలో సర్వే మ్యాప్ తప్పనిసరి అని చట్టం చెబుతున్నదని పేర్కొన్నారు. భూ భారతి చట్టంపై ఆర్డీవోలు, తహసీల్దార్లు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, చట్టం గెజిట్, రూల్స్‌పై రెవెన్యూ అధికారులు అహగాహన పెంచుకోవాలన్నారు. ఈ చట్టంలో రెండంచెల అప్పీల్ వ్యవస్థ ఉందన్నారు. జిల్లాలో ఈనెల 17 –30 వరకు భూ భారతి ఆర్వోఆర్ చట్టం పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. కొత్త చట్టం ముందస్తుగా రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో పైలెట్ ప్రాజెక్టు కింద ప్రారంభమైనట్లు పేర్కొన్నారు. అక్కడ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి వాటిని పరిష్కరించి జూన్‌లో పట్టాలు పంపిణీ చేసి రాష్ట్ర వ్యాప్తంగా అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. సమావేశంలో పెద్దపల్లి, మంథని ఆర్డీవోలు బీ గంగయ్య, సురేష్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

**పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక**

జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఎంపిక పారదర్శకంగా జరగాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలుపై కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ జే అరుణ శ్రీతో కలిసి సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో ఎటువంటి పొరపాట్లకు తావివ్వొదన్నారు. అత్యంత నిరుపేదలకు మాత్రమే మొదటి విడతలో ఇండ్లు మంజూరు చేయాలన్నారు. అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రభుత్వం మంజూరు చేసిన 3,500 ఇండ్లలో పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాల్లో ఇండ్లు మంజూరు చేశామని, మిగిలిన ఇండ్లను గ్రామాలు/ మున్సిపల్ వార్డుల వారీగా మంజూరు చేసేందుకు అలాట్మెంట్ తయారు చేయాలన్నారు. ఈనెల 21 లోగా ఇందిరమ్మ కమిటీల నుంచి 25 శాతం బఫర్‌తో ప్రతి గ్రామానికి/ వార్డుకు అలాట్ చేసిన ఇందిరమ్మ ఇండ్లకు లబ్ధిదారుల జాబితా వివ రాలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ కమిటీ ఆమోదించిన ప్రతి 200 ఇండ్ల లబ్ధిదారులకు ప్రత్యేక అధికారి, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి టీమ్‌గా ఏర్పడి ఈనెల 22 – 30 వరకు మరో సారి ఫీల్డ్ వెరిఫికేషన్ చేయాలని ఆదేశించారు. వచ్చే నెల ఒకటో తేదీన ప్రతి గ్రామంలో అర్హుల జాబితా వెల్లడించాలని సూచించారు. సమావేశంలో డీపీవో వీరబుచ్చయ్య, జడ్పీ సీఈవో నరేందర్, డీఆర్‌డీవో కాళిందిని, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీలకు సన్మానం

సుల్తానాబాద్, ఏప్రిల్ 15: ఇటీవల నూతనంగా ఎన్నికైన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి మొట్ట మొదటి సారిగా సుల్తానాబాద్‌కు వచ్చారు. వారికి బీజేపీ నాయకులు సన్మానం చేశారు. అంతకు ముందు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్సీలను గజమాలలతో సత్కరించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు గుజ్జుల రామకృష్ణారెడ్డి, కాసిపేట లింగయ్య, గోమాస శ్రీనివాస్, గొట్టిముక్కుల సురేష్‌రెడ్డి, మీస అర్జున్‌రావు, గుర్రాల మల్లేషం, కందుల సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

## కేవీని సందర్శించిన బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్

జ్యోతినగర్, ఏప్రిల్ 15: ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లోని రామగుండం కేంద్రీయ విద్యాలయాన్ని 9వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ జయంతి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భద్రత బలగాల్లో యువకు అనేక అవకాశాలు ఉన్నాయని చెప్పారు. శారీరక సామర్థ్యాన్ని పెంచుకోని అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. ఇక్కడ కేవీ ప్రిన్సిపాల్ శోభన్‌బాబు, ఎన్‌సీసీ ఇన్‌చార్జి వకీల్ సింగ్, అధ్యాపకులు ఉన్నారు.

ఫర్టిలైజర్‌సిటీ, ఏప్రిల్ 15: గోదావరిఖనిలోని సెక్రెడ్‌హార్ట్ స్కూల్‌ను మంగళవారం 9వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ జయంత సందర్శించారు. ఎన్‌సీసీ కేడెట్ల సందర్శనతో ప్రతిభ కనబరిచిన స్కూల్‌గా హర్షం వ్యక్తం చేసిన ఆయన రిపబ్లిక్‌డే క్యాంపులో పాల్గొన్న కేడెట్లు, పాఠశాల ఎన్‌సీసీ మొదటి అధికారి జ్యోత్స్న, ప్రిన్సిపాల్ ఆరోగ్యమేరి, టికలాను అభినందించారు. ఇక్కడ బెటాలియన్ సుబేదార్ మేనేజర్ సాగర్, సూర్యప్రసాద్, అన్నాల్‌సింగ్, తదితరులు ఉన్నారు.

## అంబేద్కర్ ప్రతిమ అందజేత

పెద్దపల్లి, ఏప్రిల్15: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 134వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్, ఏఈ కళ్లేపల్లి సతీష్, టీపీఎస్ బోగ వినయ్, మున్సిపల్ సిబ్బందికి అంబేద్కర్ మాదిగ శక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు బొంకూరి సురేందర్ అంబేద్కర్ ప్రతిమను అందజేశారు. ఇక్కడ నాయకులు పూదరి చంద్రశేఖర్, పాగాల శ్రీకాంత్, దొడ్డుపల్లి జగదీష్ ఉన్నారు.

## కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

రామగిరి, ఏప్రిల్ 15: రామగిరి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ప్రారంభించారు. బేగంపేట, నవాబుపేట, లద్నాపూర్, రాజాపూర్, రత్నా పూర్, కల్వచర్ల, లొంకకేసారం తదితర గ్రామాలలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు ఐకేపీ ఏపీఎం స్వరూపరాణి తెలిపారు. అలాగే 17న ముస్త్యాల గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

## సీపీఆర్ విధానంపై అవగాహన కలిగి ఉండాలి

మంథని, ఏప్రిల్ 15: సీపీఆర్ విధానంపై అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక అధికారి శివ శంకర వరప్రసాద్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు స్థానిక ఆర్టీసీ బస్ డిపోలో మేనేజర్, సిబ్బంది అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఫైర్ ఆఫీసర్ అవగాహన కల్పించారు. అదే విధంగా ఆర్టీసీ బస్సులో ఏదైనా ప్రమాదం సంభవిస్తే సీపీఆర్ చేసే విధానంపై అవగాహన కల్పించా రు. డ్రైవర్లు, కండక్టర్లు సీపీఆర్ విధానంపై అవగాహన కలిగి ఉండాలని, దీని వల్ల ఒక ప్రాణాన్ని కాపాడవచ్చన్నారు. అనంతరం బస్టాండ్‌లో సైతం అవగాహన కల్పించడంతో పాటు కరపత్రాలను పంపిణీ చేశారు. లీడింగ్ ఫైర్‌మన్ మేడ దేవేందర్, ఫైర్‌మన్ నరేందర్, రఘు, డ్రైవర్ రమేష్, నాగరాజు పాల్గొన్నారు.

## యువ కార్మికుల సదస్సును జయప్రదం చేయండి

గోదావరిఖని, ఏప్రిల్ 15: సింగరేణి పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధన కోసం ఈ నెల 20న గోదావరిఖనిలో ఏఐటీయూసీ ఆర్జీ–1 బ్రాంచీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న యువ కార్మికుల సదస్సును జయప్రదం చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆర్జీ–1 బ్రాంచీ కార్యదర్శి ఆరెల్లి పోశం కోరారు. మంగళవారం ఆర్జీ–1 ఏరియా వర్క్‌షాప్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో ఇంకా ఐదేళ్ల వరకు బొగ్గు నిల్వలు ఉన్నాయని, కొత్తగనుల ఏర్పాటుతోనే సింగరేణికి మనుగడ ఉంటుందన్నారు. లేకపోతే యువ కార్మికులకు ఉద్యోగ భద్రత కరువయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సదస్సుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, యూనియన్ ప్రధానకార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, ఉస్మానియా యునివర్సిటీ ప్రొఫెసర్ ఖాసీం హాజరవుతారని పేర్కొన్నారు. ఇక్కడ ఏఐటీయూసీ ఆర్జీ–1 బ్రాంచీ ఆఫీస్ బేరర్ దొంత సాయన్న, డిపార్ట్‌మెంట్ కార్యదర్శి బలుసు రవి, నాయకులు చంద్రమోహన్, రాజకిషోర్, ఉరడి అంజయ్య, తదితరులు ఉన్నారు.

## నియామకం


నియామక పత్రం తీసుకుంటున్న రాజేశ్

గోదావరిఖని, ఏప్రిల్ 15: తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, ముఖ్య అధికార ప్రతినిధిగా గోదావరిఖనికి చెందిన పెంట రాజేశ్ పటేల్ నియమితులయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య కార్యాలయంలో నియామక పత్రం అందుకున్నారు. ఇక్కడ సంఘం ప్రధాన కార్యదర్శి వైద్యం వెంకటేశ్వర్లు, వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరిశంకర్ ఉన్నారు. తన నియామకానికి సహకరించిన గంగుల కమలాకర్, వద్దిరాజు రవిచంద్ర, కోరుకంటి చందర్, సంఘం అధ్యక్ష, కార్యదర్శి, వర్కింగ్ ప్రెసిడెంట్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.